# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు

9th HAPPY ANNIVERSARY | 9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 351 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శనివారం 31 ఆగస్టు 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## కేసీఆర్ కుటుంబాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల తీరును ఆ పార్టీల కార్యకర్తలు అర్థం చేసుకోవాలని సూచన
- హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తున్నారని విమర్శ
- అసదుద్దీన్ ఒవైసీకి రేవంత్ రెడ్డి భయపడ్డారని ఎద్దేవా



**హైదరాబాద్ పెన్ పవర్:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం తనపై 109 కేసులు పెట్టిందని, రెండుసార్లు జైలుకు పంపిందని, కేసీఆర్ కుటుంబాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తి లేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. నాగోల్‌లో నిర్వహించిన బీజేపీ వర్క్ షాప్‌నకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పార్టీ కోసం పని చేసే వారిని కాంగ్రెస్, బీఆర్ఎస్ గుర్తించవన్నారు. ఆ పార్టీల తీరును కార్యకర్తలు అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను

వివరాలు 2లో..

## టార్గెట్ కాంగ్రెస్..

## మళ్లీ జనంలోకి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



- రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టే యోచన
- త్వరలోనే జిల్లాల పర్యటనకు కేసీఆర్
- అధినేత పర్యటన వార్తలతో కేడర్‌లో ఉత్సాహం

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ అధినేత కేసీఆ ర్ మరోమారు ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ వల్ల రైతులు పూర్తిస్థాయిలో లబ్ధి పొందలేకపోయారని భావిస్తున్న కేసీఆర్.. ప్రజల్లోకి వెళ్లి రేవంత్ ప్రభుత్వాన్ని ఎండగట్టనున్న ట్టు తెలుస్తోంది. అంతేకాదు, ఓటమి తర్వాత నిరాశలో కూరుకుపోయిన కేడర్‌లో ఉత్తేజం నింపేందుకు కూడా ఈ పర్యటన ఉపయోగపడు తుందని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, లోక్‌సభ ఎన్నికల్లో దారుణ పరాభవం, ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ వంటి వాటితో బీఆర్ ఎస్ పూర్తిగా నిరాశ నిస్పృహల్లో కూరుకుపో యింది. దీనికితోడు ఆ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు కొందరు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఉనికి కోసం బీఆర్ స్ పోరాడుతోంది. పార్టీ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ వంటి నేతలు ప్రజాక్షేత్రం లో ఉండి పోరాడుతున్నప్పటికీ పెద్దగా స్పందన రావ డం లేదన్న అభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలో ఇన్నా ళ్లూ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్ జిల్లాల పర్యటనకు రెడీ అయినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## ఉత్తమ్ కుమార్ రెడ్డి సీఎం అవుతారు

### రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్య



- నల్గొండ ప్రజల ఆశీస్సులతో ఉత్తమ్ మంత్రి అయ్యారన్న రాజగోపాల్ రెడ్డి
- ముున్ముందు ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్య
- తన నాలుకపై పుట్టుమచ్చలు ఉన్నాయని, చెప్పింది జరుగుతుందన్న ఎమ్మెల్యే

వివరాలు 2లో..


## దుర్గం చెరువులోని తిరుపతిరెడ్డి ఇంటికి వెళ్లి ఎందుకు కూల్చడం లేదు?

- హైడ్రా అంటే అందరికీ ఒకే న్యాయం పాటించాలని సూచన
- నోటీసులు ఇవ్వకుండానే పాలమూరులో ఇళ్లను కూల్చేశారని ఆగ్రహం
- ఇళ్లు కూలిన దృశ్యాలు చూసి కలిచివేశాయన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



వివరాలు 2లో..

## రేవంత్ రెడ్డి జిల్లాలోనే అర్ధరాత్రి వేళ ఇళ్లను కూల్చేశారు



- పేదలు, కుంటివారు, గుడ్డివారి గుడిసెలను కూల్చేశారని మండిపాటు
- నోటీసులు ఇవ్వకుండానే ఎలా కూల్చేశారని నిలదీత
- కాంగ్రెస్ మార్క్ పాలన ఇదేనా? అని ప్రశ్న

వివరాలు 2లో..

## రాయ్‌బరేలీ, వయనాడ్‌లో పోటీ కోసం రాహుల్‌గాంధీకి రూ. 1.4 కోట్లు ఇచ్చిన పార్టీ



- అభ్యర్థులకు ఇచ్చిన పార్టీ ఫండ్ వివరాలను ఈసీకి ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ
- రాహుల్‌కు ఒక్కో స్థానానికి రూ. 70 లక్షలు అందజేత
- నటి కంగనపై పోటీ చేసిన విక్రమాదిత్యకు అత్యధికంగా రూ. 87 లక్షలు
- ఈసీ ప్రతిపాదనలపై అభ్యర్థుల ఖర్చును పెంచిన కేంద్రం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కేరళలోని వయనాడ్, ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి పోటీ చేసి రెండు చోట్లా విజయం సాధించారు. ఈ ఎన్నికల సందర్భంగా రాహుల్‌కు పార్టీ నుంచి ఎంత మొత్తం అందిందన్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి తెలియజేసింది. ఒక్కో స్థానం

వివరాలు 2లో..

## ఖర్గే గారూ... తెలంగాణ ప్రభుత్వానికీ సలహా ఇవ్వండి



- ఇంటిని కూల్చి నిరాశ్రయులుగా చేయడం అమానవీయమని గతంలో ఖర్గే ట్వీట్
- తెలంగాణలో ఇప్పుడు అలానే జరుగుతోందంటూ కేటీఆర్ ట్వీట్
- రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి హితవు పలకాలంటూ ఖర్గేకు సూచన

వివరాలు 2లో..

## రాజకీయాల్లోకి రావడమే బెటర్ అనిపిస్తోంది... వస్తా

### సింపుల్ గా ఉండటం తనకు ఇష్టమన్న విశాల్

### కొంత కాలం క్రితం కారు అమ్మేశానని వెల్లడి

### విషయం ఏదైనా నిజాయతీగా మాట్లాడతానన్న విశాల్



**హైదరాబాద్ పెన్ పవర్:** కోలీవుడ్ హీరో విశాల్ రాజకీయా లపై ఆసక్తి ప్రదర్శిస్తున్నా రు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనం. అన్ని పనులు పక్కన పెట్టేసి రాజకీయాల్లోకి వస్తే బాగుంటుం దని పిస్తోందని... త్వర లోనే

వివరాలు 2లో..

## టీటీడీ మాదిరి యాదగిరిగుట్టకు కూడా ప్రత్యేక బోర్డు

### టూరిజంపై నూతన విధానాన్ని రూపొందించాలన్న రేవంత్

### ఎకో, టెంపుల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన

### హైదరాబాద్ వెలుపల మరో జూపార్క్ అభివృద్ధికి ప్లాన్ తయారు చేయాలని ఆదేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో ఇప్పటికే పలు అంశాలపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా టూరిజంపై ఫోకస్ చేశారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధిపై నూతన విధానం రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎకో, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. హైదరాబాద్ బయట మరో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం యాదగిరిగుట్ట (యాదాద్రి) అభివృద్ధిపై కీలక ఆదేశాలను ముఖ్యమంత్రి జారీ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు మాదిరి యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆలయ గోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని చెప్పారు. ఆలయ అభివృద్ధి పెండింగ్ పనులు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టాల్సిన పనుల వివరాలను ఇవ్వాలని సూచించారు.

## పాక్‌కు తగిన విధంగా బదులిస్తాం

- పాకిస్థాన్‌తో చర్చలు జరిపే అంశంపై జైశంకర్ కీలక వ్యాఖ్యలు
- పాక్‌తో పదే పదే చర్చలు జరిపే కాలం ముగిసిందన్న జైశంకర్
- జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 ముగిసిన కథ అన్న జైశంకర్



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్‌తో చర్చలు జరిపే అంశంపై విదేశాంగ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఈరోజు నిర్వహించిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పాక్‌తో పదే పదే చర్చలు జరిపే కాలం ముగిసిందని ఆయన స్పష్టం చేశారు. పాక్ మనతో ఎలా వ్యవహరిస్తే మనమూ ఆ దేశంతో అలాగే వ్యవహరిస్తామని పేర్కొన్నారు. పాక్‌కు తగిన విధంగా బదులిస్తామన్నారు. పాక్ ఉగ్రవాద చర్యలకు తగిన పర్యవసానాలు ఉంటాయని హెచ్చరించారు. జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370 ముగిసిన కథ అని వ్యాఖ్యానించారు.

వివరాలు 2లో..

## సంపాదకీయం

# అతిగా ఎనర్జీ డ్రింక్ తాగితే ఏమవుతుందో తెలుసా...

ఎనర్జీ డ్రింక్స్ అతిగా తాగడం ఆరోగ్యానికి చాలా హానికరమని వైద్య నిపుణులు తెలుపుతున్నారు. ప్రతి రోజూ తాగడం వల్ల హైపర్‌టెన్షన్ సమస్య కూడా రావొచ్చు. ఎందుకంటే ఎనర్జీ డ్రింక్స్‌లో కెఫీన్ ఎక్కువగా ఉంటుంది. అధిక మొత్తంలో కెఫిన్ తీసుకోవడం వల్ల గుండె సమస్యలు వచ్చే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. దాహం వేసిన సందర్భంలో, ఆకలిగా ఉన్నప్పుడు సమయానికి ఆహారం అందుబాటులో లేనప్పుడు చాలా మంది తక్షణం శక్తి కోసం ఎనర్జీ డ్రింక్స్ ను తాగేస్తుంటారు. ఇటీవలి కాలంలో మార్కెట్లు వివిధ రకాల కంపెనీల ఎనర్జీ డ్రింక్ లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో చాలా మంది వీటిని తాగటం రోజు వారి అలవాటుగా మార్చుకున్నారు. ఈ మధ్య చాలామంది ఎనర్జీ కు బాగా అతిగా తాగుతున్నారు. దీని వల్ల కొన్ని అనారోగ్య సమస్యలొస్తున్నాయి. మిగతా వాళ్లతో పోలిస్తే ఎనర్జీ డ్రింక్ ప్రభావం పిల్లల మీద ఎక్కువ ప్రభావం చూపుతుంది. గర్భిణులు, బాలింతలు, గుండె రక్తనాళాల సమస్యలు ఉన్నవారు వీటికి దూరంగా ఉండడం చాలా అవసరం. ఆటలాడేవాళ్లు దాహం వేసినప్పుడు ఈ డ్రింక్స్. తీసుకోవడం అలవాటు అయితే ఆటకు ముందు గానీ, ఆటలో బాగా అలసిపోయినప్పుడు గానీ వీటిని అసలే తీసుకోకూడదని డాక్టరు చెబుతున్నారు. అధికంగా శారీరక వ్యాయామం చేసేవారు, ముఖ్యంగా క్రీడాకారులు తక్షణ ఎనర్జీకోసం ఎనర్జీ డ్రింక్స్ ను తాగుతుండటం మనం చూస్తుంటాం. అయితే వారే కాకుండా మామూలు వారు సైతం అవసరం ఉన్నా, లేకున్నాఅదేపనిగా ఎనర్జీ డ్రింక్ లను తాగేస్తున్నారు. చాలా మంది ఇంట్లో ఫ్రిజ్ లలో ఎనర్జీ డ్రింక్ లను నిల్వ చేసుకుని తాగటం అలవాటు చేసుకున్నారు. అయితే ఇలా అదేపనిగా ఎనర్జీ డ్రింక్ లను తాగటం ఏమాత్రం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎనర్జీ డ్రింక్లు బాగా శక్తినిస్తాయని తీసుకుంటున్నారు. అయితే అతిగా తీసుకునేవాళ్లలో చాలా ప్రతికూల ప్రభావాలను చూపుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా, గుండె రక్తనాళాల పైనా.. నాడీ మండలం. జీర్ణవ్యవస్థ, మూత్రపిండాలు, ఎండోక్రైన్ వ్యవస్థలను తీవ్రమైన దుష్ప్రభావాలకు గురిచేస్తున్నట్లు వీరు చెబుతున్నారు. వీటితో పాటు కొన్ని రకాల మానసిక రుగ్మతలకు కూడా వారి తీస్తుందంటున్నారు. ప్రత్యేకంగా చిన్న పిల్లలు, యుక్త వయస్కుల మీద వీటి ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుండట.. ఎనర్జీ డ్రింకుల్లో విటమిన్లు, లవణాలు, అమినో యాసిడ్స్, మూలికాంశాలతో పాటు కెఫిన్ చాలా ఎక్కువ మోతాదులో ఉంటాయంటున్నారు డాక్టర్లు. ఎక్కువసార్లు తీసుకోకుండా, మోతాదులో తీసుకుంటే ఆరోగ్యా నికి మంచిదని చెప్తున్నారు..

ఎనర్జీ డ్రింక్ లను తాగేవారిలో ఆరోగ్యంపై దుష్ప్రభావాలు అధికంగా ఉంటాయని పలు పరిశోధనల్లో తేలింది. ఎనర్జీ డ్రింక్ లో కెఫిన్, టౌరిన్ షుగర్, స్వీటెనర్, హెర్బల్ సప్లిమెంట్స్ తోపాటు హానికరమైన పదార్థాలు ఉంటాయి. కెఫిన్ కారణంగా శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. ఇది ప్రధానంగా గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. గుండె కొట్టుకునే వేగాన్ని పెరిగేలా చేస్తుంది. దీని వల్ల రక్త ప్రవాహంలో తేడాలు రావటం వంటివి చోటు చేసుకుంటాయి. అంతేకాకుండా ఈ ఎనర్జీ డ్రింక్స్ లో ఉండే హానికరమైన పదార్థాల ప్రభావం శరీరంలోని ఇతర అవయవాలపైనా పడుతుంది. తద్వారా ఆరోగ్యం దెబ్బతింటుంది. బాడీకి ఎనర్జీని ఇవ్వాలన్న ఆలోచనతో అనేక మంది రోజుకు నాలుగైదు ఎనర్జీ డ్రింక్ లను తాగేస్తుంటారు. ఇలాంటి వారి శరీరంలోకి ఎక్కువ మోతాదులో కెఫిన్ చేరుతుంది. దాని ప్రభావం వల్ల మానసికంగా శరీరంపై ప్రభావం చూపుటం వల్ల అదేపనిగా ఎనర్జీ డ్రింక్ లు తాగాలన్న వ్యసనాన్ని కలిగుతుంది. రోజుకు 300ఎంజి మించి కెఫిన్ శరీరంలోకి చేరితే ఆరోగ్యానికి ప్రమాదం ముప్పుతప్పదని గుర్తుంచుకోవాలి.

# కేసీఆర్ కుటుంబాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు

- మొదటి పేజీ తరువాయి

నెరవేర్చడం లేదని విమర్శించారు. అందరికీ రుణమాఫీ చేయలేదని, ఈ అంశంపై అంతా చర్చ సాగుతోందన్నారు. అందుకే హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తున్నారని ఆరోపించారు. ఒవైసీ విద్యా సంస్థల విషయంలో మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీకి రేవంత్ రెడ్డి ప్రభుత్వం భయపడిందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల టార్గెట్ తామేనని... అందుకే ఆ రెండు పార్టీలు మీరు బీజేపీతో కలిసిపోయారంటే మీరు బీజేపీతో కలిసిపోయారంటూ పరస్పరం ఆరోపణలు గుప్పించుకుంటున్నాయన్నారు. మద్యం పాలసీ కేసులో జైల్లో ఉన్న కవితకు బెయిల్ రావడానికి బీజేపీయే కారణమని కాంగ్రెస్ చెబుతోందని, కానీ వ్యక్తులు, ప్రభుత్వాలు ఇచ్చే సూచనలతో కోర్టులు తీర్పులు ఇవ్వవని గుర్తించాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ కలవడం పక్కా అని జోస్యం చెప్పారు. ఓబీసీని దేశ ప్రధానిగా చేసింది బీజేపీయే అన్నారు. బీజేపీ ఏం చేసిందో చెప్పి సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో పని చేస్తోందన్నారు.

**అవమానాలను తట్టుకొని ధర్మం కోసం, దేశం కోసం నిలిచిన పార్టీ**

ఎన్నో అవమానాలను తట్టుకొని, దేశం కోసం, ధర్మం కోసం నిలిచిన పార్టీ బీజేపీ అని బండి సంజయ్ స్పష్టం చేశారు. భారతదేశం మరిన్ని ముక్కలు కాకుండా అడ్డుకున్న పార్టీ బీజేపీయేని వివరించారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంబేద్కర్ కలలకు రూపం ఇచ్చిన పార్టీ మనదేనని అన్నారు. అశాంతికి, అల్లకల్లోలాలకు కారణమైన ఆర్టికల్ 370ని రద్దు చేశామని వెల్లడించారు. నాడైనా, నేడైనా, ఏనాడైనా దేశం కోసం, ధర్మం కోసం పరితపించే ఏకైక పార్టీ బీజేపీయేని ఉద్ఘాటించారు.

# ఖర్గే గారూ... తెలంగాణ ప్రభుత్వానికీ సలహా ఇవ్వండి

**హైదరాబాద్ పెన్ పవర్:**ఖర్గే గారూ... మీరు చెప్పినట్లుగా ఒకరి ఇంటిని కూల్చేసి, వారి కుటుంబాన్ని నిరాశ్రయులుగా చేయడం అమానవీయం, అన్యాయం అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర ట్వీట్ చేశారు. మహబూబ్ నగర్ పట్టణ సమీపంలో ఇళ్లను కూల్చివేసిన ఘటనపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. గతంలో బుల్డోజర్ పాలనపై ఖర్గే చేసిన ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఒకరి ఇంటిని కూల్చివేసి, వారి కుటుంబాన్ని నిరాశ్రయులను చేయడం అమానవీయం, అన్యాయం" అని ఖర్గే గతంలో ట్వీట్ చేశారు. దీనిని కేటీఆర్ ప్రస్తావించారు. తెలంగాణలోనూ చట్టం, న్యాయవ్యవస్థ పట్ల తీవ్ర ధిక్కారం కనిపిస్తోందని పేర్కొన్నారు. మహబూబ్ నగర్ పట్టణంలో పేదలకు చెందిన 75 ఇళ్లను తెల్లవారుజామున 3 గంటలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు కోల్పోయిన ఈ నిరుపేదల్లో 25 కుటుంబాలు వికలాంగులవేనని తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోను కూడా కేటీఆర్ పోస్ట్ చేశారు. సరైన విధివిధానాలు లేని చట్టం చట్టమే కాదన్నారు. దయచేసి తెలంగాణను ఈ దేశంలో మరో బుల్డోజర్ రాజ్యంగా మారకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇవ్వండని ఖర్గేకు సూచించారు.

# రాయ్‌బరేలీ, వయనాడ్‌లో పోటీ కోసం రాహుల్‌గాంధీకి రూ. 1.4 కోట్లు ఇచ్చిన పార్టీ

- మొదటి పేజీ తరువాయి

కోసం రాహుల్‌కు రూ. 70 లక్షల చొప్పున మొత్తం రూ. 1.4 కోట్లను పార్టీ ఫండ్‌గా ఇచ్చినట్టు తెలిపింది.

హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నుంచి బరిలోకి దిగిన బీజేపీ అభ్యర్థి, బాలీవుడ్ నటి కంగన రనౌత్‌పై పోటీ చేసిన విక్రమాదిత్య సింగ్ పార్టీలోనే అత్యధికంగా రూ. 87 లక్షలు అందుకున్నారు. బీజేపీ సిట్టింగ్ ఎంపీ స్మృతి ఇరానీని ఓడించిన కిషోరీలాల్ శర్మ, కేసీ వేణుగోపాల్ (అళప్పుళ, కేరళ), మాణికం ఠాగోర్ (విరుధునగర్, తమిళనాడు), కర్ణాటకలోని గుల్బర్గా నుంచి బరిలోకి దిగిన రాధాకృష్ణ, పంజాబ్‌లోని ఆనంద్‌పూర్ సాహిబ్ నుంచి పోటీ చేసిన విజయ్ ఇందర్ సింగ్లాకు చెరో రూ. 70 లక్షలు అందించింది.

కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆనంద శర్మ, దిగ్విజయ్ సింగ్ వరుసగా రూ. 46 లక్షలు, రూ. 50 లక్షలు అందుకున్నారు. రాయ్‌బరేలీ, వయనాడ్ నుంచి విజయం సాధించిన రాహుల్‌గాంధీ వయనాడ్ సీటుకు రాజీనామా చేసి యూపీ స్థానాన్ని అట్టేపెట్టుకున్నారు. కాగా, ఎన్నికల సంఘం 2022లో చేసిన ప్రతిపాదన మేరకు ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల ఖర్చును రూ. 70 లక్షల నుంచి రూ. 95 లక్షలకు, అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి ఖర్చును రూ. 28 లక్షల నుంచి రూ. 40 లక్షలకు పెంచింది.

# దుర్గం చెరువులోని తిరుపతిరెడ్డి ఇంటికి వెళ్లి ఎందుకు కూల్చడం లేదు?

**హైదరాబాద్ పెన్ పవర్:**మహబూబ్ నగర్‌లో పేదల ఇళ్లను కూల్చేసిన అధికారులు... హైదరాబాద్‌లోని దుర్గం చెరువులో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటికి ఎందుకు వెళ్లడం లేదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... హైడ్రా అంటే అందరికీ ఒకే న్యాయం పాటిం చాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడాలనుకోవడం మంచిదే కానీ... ఈ పేరుతో పేదలకు ఒక న్యాయం, ధనవంతులకు ఒక న్యాయం ఉండవద్దన్నారు. నోటీసులు ఇవ్వకుండానే పేదల ఇళ్లను కూల్చేస్తున్న హైడ్రా దుర్గం చెరువులోని అక్రమ నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. పాలమూరు అంధుల కాలనీలో అధికారులు ఇళ్లు కూల్చిన దృశ్యాలు తనను కలిచివేశాయన్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతుంటే ముఖ్యమంత్రికి నిద్ర ఎలా పడుతుందని ప్రశ్నించారు. పోలీసు బలంతో అంధుల కాలనీని కూల్చిన అధికారులు, అదే పోలీసులతో వెళ్లి తిరుపతిరెడ్డి ఇంటిని ఎందుకు కూల్చడం లేదో చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో గురుకులాలు నిర్వీర్యమయ్యాయన్నారు. తొమ్మిది నెలలుగా విద్యాశాఖకు మంత్రి కూడా లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ బాధ్యతలను చూస్తున్న రేవంత్ రెడ్డి కనీసం గురుకులాలపై సమీక్ష నిర్వహించారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదని, ప్రతీకార పాలన అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజురీయింబర్సుమెంట్స్ చెల్లించకపోవడంతో... ఫీజులు కట్టడం లేదని యాజమాన్యాలు మెమోలు ఇవ్వడం లేదన్నారు.

పేద విద్యార్థులు అంటే రేవంత్ రెడ్డికి కోపం ఎందుకో చెప్పాలన్నారు. విద్యార్థి భరోసా కింద ఒక్కో విద్యార్థికి రూ.5 లక్షలు ఇస్తామన్న ప్రభుత్వం దానిని పక్కన పెట్టేసిందన్నారు. ఖైదీల తిండి కోసం రోజుకు రూ.83 ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, విద్యార్థుల కోసం మాత్రం రూ.37 మాత్రమే ఖర్చు చేస్తోందని విమర్శించారు. గురుకుల విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.

# రాజకీయాల్లోకి రావడమే బెటర్ అనిపిస్తోంది... వస్తా

- మొదటి పేజీ తరువాయి

రాజకీయాల్లోకి వస్తానని, ప్రజాసేవ చేస్తానని విశాల్ తెలిపారు. విషయం ఏదైనా సరే తాను నిజయతీగా మాట్లాడతానని... తన మాదిరి అందరూ ఉండలేరని చెప్పారు. తనకు చాలా సింపుల్ గా ఉండటమే ఇష్టమని సినీ హీరో విశాల్ చెప్పారు. ఆడంబరంగా బతకడం తనకు ఇష్టం ఉండదని అన్నారు. ఇతరులను కాపీ కొట్టడం కూడా తనకు నచ్చదని తెలిపారు. గతంలో ఓ ఎన్నికల సమయంలో తాను సైకిల్ పై వెళ్లడంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయని... హీరో విజయ్ ను తాను కాపీ కొట్టానని పలువురు విమర్శించారని... తనకు కాపీ కొట్టడం తెలియదని చెప్పారు. పోలింగ్ బూత్ కు తమ ఇల్లు దగ్గర్లోనే ఉండటంతో తాను సైకిల్ పై వెళ్లానని తెలిపారు. విజయ్ ను ఇమిటేట్ చేయడం కోసం అలా చేయలేదని చెప్పారు. ప్రస్తుతం తన తల్లిదండ్రులకు మాత్రమే కారు ఉందని, తనకు లేదని, కొంతకాలం క్రితం అమ్మేశానని విశాల్ ఇటీవల రత్నం సినిమా ప్రమోషన్స్ లో తెలిపారు. చెన్నైలో రోడ్లు దారుణంగా ఉన్నాయని... సైకిల్ పై అయితే ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణించవచ్చని చెప్పారు.

# రేవంత్ రెడ్డి జిల్లాలోనే అర్ధరాత్రి వేళ ఇళ్లను కూల్చేశారు

**హైదరాబాద్ పెన్ పవర్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోనే అర్ధరాత్రిపూట పేదలు, దివ్యాంగుల ఇళ్లను కూల్చివేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. ఇవాళ బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మహబూబ్ నగర్ పట్టణ సమీపంలో పేదలు, కుంటివారు, గుడ్డివారు గుడిసెలు వేసుకొని ఉంటున్న ఇళ్లను కూల్చివేశారని మండిపడ్డారు. నోటీసులు ఇవ్వకుండానే ఎలా కూల్చివేశారని ప్రశ్నించారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఫోన్లు లాక్కొని, జేసీబీలతో ఇళ్లను కూల్చేశారన్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ లో ఉండే కోటీశ్వరుల ఇళ్లు అనుకున్నారా? ఏమిటి? అని ప్రశ్నించారు. వీరిని చూస్తే కనికరం ఎందుకు కలగలేదు? అని ఆవేదన శ్రీనివాస్ గౌడ్ వ్యక్తం చేశారు. డబ్బు ఉన్న వాళ్లకు కనీసం నోటీసులు అయినా ఇస్తున్నారు కదా... కానీ వీరి ఇళ్లకు నోటీసులు కూడా ఇవ్వకుండా కూల్చేశారని ధ్వజమెత్తారు. ధనికులకు ఓ న్యాయం... పేదవారికి ఇంకో న్యాయమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మార్క్ పాలన ఇదేనా? అని శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ ఇళ్లు కూల్చేసిన బాధితులకు ఇళ్లను కట్టించి ఇవ్వాలని లేదంటే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ఘటనపై మానవ హక్కుల సంఘం సుమోటోగా కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# పాక్‌కు తగిన విధంగా బదులిస్తాం

- మొదటి పేజీ తరువాయి

జర్మనీలోని దంపతులకు జైశంకర్ హామీ

జర్మనీలో థానేకు చెందిన దంపతులకు చేదు అనుభవం ఎదురైంది. భౌతికంగా హింసించారనే ఆరోపణలతో వీరి కూతురిని జర్మనీ ప్రభుత్వం సంరక్షణ కేంద్రానికి తరలించింది. ఆ చిన్నారి 36 నెలలుగా అక్కడే ఉంటోంది. ఈ విషయాన్ని ఆ తల్లిదండ్రులు స్థానిక ఎంపీ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన కేంద్రమంత్రికి తెలియజేశారు. ఆ చిన్నారిని, తల్లిదండ్రులను సాధ్యమైనంత త్వరగా భారత్‌కు రప్పిస్తామని జైశంకర్ హామీ ఇచ్చారు.

# హెచ్‌సీఏలో భారీ అవినీతి జరిగింది: తెలంగాణ క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి

హెచ్‌సీఏలో భారీగా అవకతవకలు జరిగాయనే విమర్శలు వస్తున్నాయి. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి శుక్రవారం సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో భారీగా అవకతవకలు జరిగాయన్నారు. బీసీసీఐ నుంచి వచ్చిన నిధులను హెచ్‌సీఏ దుర్వినియోగం చేసిందన్నారు. దీనికి సంబంధించి విచారణ జరిపి అసోసియేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ క్రికెటర్ అజారుద్దీన్ హయాంలో హెచ్ సీఏలో జరిగిన అవినీతి ఇప్పుడున్న అధ్యక్షుడు జగన్ మోహన్ రావు హయాంలోనూ కొనసాగుతోందన్నారు. హెచ్‌సీఏ పరిధిలోని క్లబ్బులన్నీ అవినీతిమయం అయ్యాయన్నారు. సుప్రీంకోర్టు తీర్పును, గ్రామీణ క్రికెట్‌ను హెచ్ సీఏ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. హెచ్‌సీఏపై ఏసీబీ, సీబీఐకి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ అవినీతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు.

# ఉత్తమ్ కుమార్ రెడ్డి సీఎం అవుతారు

**హైదరాబాద్ పెన్ పవర్:**మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో నీటి పారుదల పనులపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... నల్గొండ ప్రజల ఆశీస్సులతో ఉత్తమ్ మంత్రి అయ్యారన్నారు. మున్ముందు ఆయన తప్పకుండా సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. తన నాలుకపై పుట్టుమచ్చలు ఉన్నాయని, తాను ఏది చెప్పినా తప్పకుండా జరుగుతుందన్నారు.

ఆయన ఇంకా మాట్లాడుతూ, బునాదిగాని పిల్లాయిపల్లి ధర్మారెడ్డి కాల్వను రీడిజైన్ చేయాలని కోరారు. ఈ కాల్వ వెడల్పును పెంచాలన్నారు. దీంతో ఆయకట్టు కూడా రెండింతలు అవుతుందన్నారు. అధికారులు దూరదృష్టితో ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే సూచించారు.


# గుడ్‌న్యూస్..దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ రైలు వస్తోంది..ఇంజిన్ టెస్టింగ్ సక్సెస్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇప్పటివరకు మనం బొగ్గుతో నడిచే రైలు..కరెంట్ తో నడిచే రైలు.. హైస్పీడ్ రైలు, బుల్లెట్ రైళ్లు ఇలా అనేక రకాల రైళ్లను చూశాం..ఇప్పుడు మరో కొత్త రకం రైలు రాబోతోంది.. అదీ భారత్ లో మొట్టమొదటి రైలు.. దీనికి ఇంజిన్ కు సంబంధించిన అన్ని టెస్టులు విజయవంతంగా నిర్వహించింది రైల్వే మంత్రిత్వ శాఖ.. ఇంతకీ అది ఏం రైలు.. ఎలా నడుస్తుంది.. ఇంజిన్ లో ఇంధనంగా ఏం వాడుతారు.. వేగం ఎంత.. సౌకర్యాలు ఎలా ఉంటాయో తెలుసుకుందాం.. భారత రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని అయిన రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ ద భారత దేశపు మొట్టమొదటి హైడ్రోజన్ రైలు కోసం ఇంధన సెల్, బ్యాటరీ వ్యవస్థల పనితీరును సక్సెస్ ఫుల్ గా నిర్వహించింది.. ఈ విషయాన్ని బుధవారం (ఆగస్టు 29) న ప్రకటించింది.

జింద్– సోనిపట్ ల మధ్య డ్రైవ్ సైకిల్ సిమ్యులేషన్ సరిపోల్చడానికి పరీక్ష నిర్వహించారు. సక్సెస్ ఫుల్ అయ్యారు. పర్యావరణం, రైల్వే రవాణాలో అభివృద్ధిలో భారత్ ముందుంచే క్రమంలో హైడ్రోజన్ రైలు ఇంజిన్ టెస్టింగ్ ఓ మైలు రాయి.

### త్వరలో 35 హైడ్రోజన్ రైళ్లు

హెరిటేజ్ ఫర్ హెరిటేజ్ కార్యక్రమం కింద 35 హైడ్రోజన్ రైళ్లను తీసుకొస్తున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ గతేడాది రాజ్యసభలో ప్రకటించారు. దీనికి సంబంధించిన వివరాలు అందించారు. ఒక్కో రైలు సుమారు రూ. 80కోట్లు, గ్రౌండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కు హెరిటేజ్ , హిల్ రూట్ లకోసం రూ. 70 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.




అయితే ఇప్పటికే హైడ్రోజన్ ఇంధన కణాలతో డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (%ణజువీఖ%) రేక్ లను రీట్రోఫిట్ చేయడానికి పైలట్ ప్రాజెక్టును ప్రారంభించింది రైల్వే శాఖ. గ్రౌండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ తో సహా ఈ ప్రాజెక్ట రూ. 111.82కోట్లతో మంజూరు చేశారు. నార్గ్ రైల్వే జోన్ లో జింద్ పానిపట్ సెక్షన్ కోసం ఈ ప్రణాళికలు చేశారు. పర్యావరణ పరిరక్షణ, జీరో కార్బన్ ఉద్గార లక్ష్యాలకు మద్దుతుగా హైడ్రోజన్ రైళ్లను రూపొందిస్తున్నట్లు రైల్వే శాఖ తెలిపింది.

# గూగుల్‌ను నమ్ముకుంటే..ఫ్లైట్ మిస్..వ్యాపారవేత్త X పోస్ట్ వైరల్

**హైదరాబాద్ పెన్ పవర్:** గూగుల్ మ్యాప్ గురించి మనందరికి తెలిసిందే.. తెలియని ప్రాంతాలకు వెళ్లేందుకు స్మార్ట్ ఫోన్ లో గూగుల్ మ్యాప్ ను ఓపెన్ చేసి.. దాని డైరెక్షన్ లో మనం చేరుకోవాల్సిన ప్రాంతాలకు వెళ్తు ంటాం. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, ముంబై వంటి పెద్ద పెద్ద నగరాలతోపాటు.. చిన్నా పట్టణాల్లో కూడా ఈ గూగుల్ మ్యాప్ ను ఉపయోగిస్తుంటారు.. అయితే కొన్ని సందర్భాల్లో గూగుల్ మ్యాప్ ఎర్రర్ తో కస్టమర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంఘటన చాలా చూశాం.. విన్నాం.. తాజాగా గూగుల్ మ్యాప్ ను నమ్ముకొని తాను వెళ్లాల్సిన ఫ్లైట్ ను మిస్సయ్యాడు ఓ వ్యాపార వేత్త.. గూగుల్ మ్యాప్ తో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను సోషల్ మీడియా ప్లాట్ ఫాం%శ% లో షేర్ చేశాడు.. ఆశీస్ కచోలియా.. ఓ వ్యాపారవేత్త.. బెంగళూరు నుంచి ముంబై వెళ్లేందుకు ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకున్నాడు.. సమయానికి ఎయిర్ పోర్ట్ చేరుకునేందుకు క్యాబ్ బుక్ చేసుకుని వెళ్తుండగా.. టైం, రూల్ డైరెక్షన్ కోసం గూగుల్ మ్యాప్ ను ఎంచుకున్నాడు.. అయితే ఆశీష్ కచోలియాను గూగుల్ మ్యాప్ తప్పుదోవ పట్టించింది.. ధీంతో కచోలియా తనకు ఎదురైన అనుభవాన్ని నెటిజన్లతో షేర్ చేసుకున్నాడు.

గూగుల్ మ్యాప్ ను ఆశ్రయించిన కచోలియాకు.. తాను ఎయిర్ పోర్టు చేరుకునేందుకు టైం 1.45 నిమిషాలుపడుతుందని గూగుల్ చూపింది..అయితే ట్రాఫిక్ రద్దీ లేకున్నా.. తాను ఎయిర్ పోర్టు చేరుకునేందుకు 3 గంటలుపట్టిందని.. తాను ఎక్కాల్సినఫ్లైట్ మిస్సయిందని కచోలియా తన పోస్టులో ఆవేదన వ్యక్తం చేశారు.

గూగుల్ మ్యాప్స్ లో సరైన ప్రయాణ సమయం చూపించలేదు.. దీంతో తాను ఎక్కాల్సిన విమానం రద్దయిందని పోస్ట్ షేర్ చేసిన



కచోలియాతోచాలామంది నెటిజన్లు ఏకీభవించారు. గూగుల్ అంచనాలు నమ్మశక్యం కానివి.. నగరాల్లో కొత్త ప్రాంతాలకు వెళ్లాల్సిన వచ్చినపుడు స్థానికులను అడిగి తెలుసుకుంటే మంచిదని నెటిజన్లు సలహా ఇస్తున్నారు.

గూగుల్ మ్యాప్ లో ప్రయాణ సమయాన్ని విశ్వసించలేని ఏకైక నగరం బెంగళూరు అని మరో నెటిజన్ రాశాడు. గుర్గావ్ లో కూడా అరుదుగా జరుగుతుంటాయని చెపుతున్నారు నెటిజన్లు.

కచోలిన తన పోస్టులో ముంబై, బెంగళూరు నగరాల్లో మౌలిక సదుపాయాలను పోల్చుతూ రాశాడు.. బెంగళూరు కంటే ముంబై నగరంలోని మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి.. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ కు కృతజ్ఞతలు అంటూ పోస్టు లో రాశాడు..

ఏదీ ఏమైనా కొత్త అడ్రస్ లకు వెళ్లినప్పుడు గూగుల్ మ్యాప్ తో పాటు స్థానికులను ఆరా తీస్తే మంచిదని కచోలియా పోస్ట్ లో నెటిజన్లకు బోధపడుతోంది.

# సెప్టెంబర్ నెలలో పండుగలు.. సెలవులు ఇవే..




**హైదరాబాద్ పెన్ పవర్:** సెప్టెంబర్ నెల ప్రారంభం కానుంది. ఈ నెలలో వరుసగా ఐదు రోజులు సెలవులు వస్తున్నాయి. అయితే ఈ ఐదు రోజులు రెండు తెలుగు రాష్ట్రాలలో కలిపి సెలవులు వుండనున్నాయి. సెప్టెంబరు 7, 16 తేదీలను ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించింది. ఆ రెండు రోజులు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బ్యాంకులు మూతపడనున్నాయి. సెప్టెంబర్ 7న వినాయక చవితి పండుగ వచ్చింది. ఈ 7వ తేదీ..శనివారం వస్తుంది. ఆ తర్వాత ఆదివారం కావడంతో వరుసగా రెండు రోజులు సెలవులు ఉంటాయి. చాలా రాష్ట్రాలు ఈ వినాయక చవితిని అత్యంత వైభవంగా జరుపుకుంటాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఉన్నాయి.

ఇక.. సెప్టెంబర్ నెలలో ప్రభుత్వం మరో ప్రభుత్వ సెలవు ప్రకటించింది. మిలాద్–ఉన్–నబీ సెప్టెంబర్ 16న జరుపుకుంటారు. ఈ పండుగ సోమవారం వస్తుంది. అంతకు ముందు రోజు సెప్టెంబర్ 15 ఆదివారం.. అది ఎలాగో హాలిడేనే. అదే విధంగా సెప్టెంబర్ 14వ తేదీ రెండో శనివారం వచ్చింది. ఇలా సెప్టెంబర్ 14 నుంచి 16వ తేదీ వరకు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. అన్ని ప్రైవేట్, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, విద్యా సంస్థలు సెప్టెంబర్ 16న మూసి ఉండనున్నాయి. ఇదిలా ఉండగా, సెప్టెంబర్ నెలలో 14 రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. వివిధ పండుగలు, ఇతర కార్యక్రమాల కారణంగా ఆయా ప్రాంతాల్లో బ్యాంకులకు సెలవులు ఉండనున్నాయి. విద్యార్థులకు ఐదు రోజులు సెలవులు వచ్చాయి. తాజాగా సెలవుల జాబితా తెలియడంతో కొందరు విద్యార్థులు ఎగిరి గంతేస్తున్నారు. ఇంకా ఇవి కాకుండాసెప్టెంబర్ 5 టీచర్స్ డే సెలబ్రేషన్స్ జరుపుకుంటారు.

# మాకు చచ్చి పోవాలనిపిస్తోంది: ఏపీ ఇంజినీరింగ్ విద్యార్థినుల ఆడియోలు వైరల్



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళలు అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా రోడ్డుపై తిరిగినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని ఒక మహానుభావుడు అన్నారు. కానీ వెలుగుచూస్తున్న ఘటనలు చూస్తుంటే అర్ధరాత్రి రోడ్డుపై దేవుడెరుగు.. పుట్టింట్లోనూ, మెట్టినింట్లోనూ, విద్యనభ్యసించే కళాశాలలోనూ స్వేచ్ఛగా, భద్రంగా బతకలేకపోతున్నారు. ప్రతి క్షణం దేశంలో ఏదో ఒక చోట మహిళలపై అఘాయిత్యాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లాలోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఓ విద్యార్థిని సహాయంతో గర్ల్స్ హాస్టల్ వాష్‌రూమ్‌లో సీసీ కెమరాలు అమర్చిన ఓ ప్రబుద్ధుడు.. తోటి విద్యార్థినుల వీడియోలు చిత్రీకరించాడు. దాదాపు 300 మంది విద్యార్థినులు ఉన్న కాలేజీ లేడీస్ హాస్టల్‌లో ఈ ఘటన విద్యార్థినులకు, వారి తల్లిదండ్రులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

### చచ్చి పోవాలనిపిస్తోంది

వీడియోలు రికార్డు చేసినట్లు వార్తలు గప్పుమనడంతో విద్యార్థినులు ప్రశాంతంగా ఉండలేకపోతున్నారు. వీడియోలు బయటకొస్తే సమాజంలో తమ పరిస్థితి ఏంటని.. ఎలా తలెత్తుకు తిరగగలమని వాపోతున్నారు. తల్లిదండ్రులకు, గ్రామస్థులకు తమ మొహాలు ఎలా చూపించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ బాధను తోటి విద్యార్థినులతో పంచుకుంటూ కంటతడి పెట్టుకుంటున్నారు. విద్యార్థినులు తోటి విద్యార్థినులతో తమ బాధను పంచుకుంటున్న ఆడియోలు సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి.

### ఫైనల్ ఇయర్ చదువుతున్న నిందితుడు

ఈ ఘటనలో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయ్ అనే విద్యార్థి అదే కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఇప్పటికే అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి ల్యాప్‌టాప్, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. వాటిలోనే విద్యార్థినులకు సంబంధించిన వీడియోలు ఉన్నట్లు సమాచారం. డబ్బుకు ఆశపడి నిందితుడు తోటి విద్యార్థులకు వీడియోలు అమ్మినట్లు ప్రచారం జరుగుతోంది. అలా వీడియోలు నలుగురి చెంతకు చేరడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

## అప్పటివరకు ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూనే ఉన్నాడు..ఇంతలోనే గుండెపోటుతో..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల గుండెపోటుతో మరణాలు బాగా పెరిగాయి. ఆడుతూ..వయసుతో సంబంధం లేకుండా పాడుతూ కుప్పకూలిపోతున్నారు. స్నానం చేస్తూ గుండెపోటుతో మృతి.. క్రికెట్ ఆడుతూ హార్ట్ అటాక్ తో మృతి.. పత్రికా సమావేశంలో మాట్లాడుతూ మృతి..ఇలా అనేక గుండెపోటుతో చనిపోయారని రోజుకో వార్త వింటున్నాం..చూస్తున్నాం.. తాజాగా ఢిల్లీలో ఓ యువ కానిస్టేబుల్ డ్యాన్స్ చేస్తూ కుప్పకూలి ప్రాణాలు ఒదిలిన సంఘటన జరిగింది..

గతంలో ఓ 45 యేళ్లు దాటిన వారిలోనే ఎక్కువగా గుండెపోటు వంటి అనారోగ్యం కనిపించేది..గత 5యేళ్లుగా గుండెపోటులో చిన్నారులు కూడా చనిపోయిన సంఘటనలు జరుగుతున్నాయి. కారణాలు ఏవైనా.. గుండెపోటుతో మరణాలు పెరగడం ఆందోళన కలిస్తోంది. తాజాగా ఢిల్లీలో ఓ యువ పోలీస్ కానిస్టేబుల్ డ్యాన్స్ చేస్తూ గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందాడు. ఢిల్లీ రూప్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రవికుమార్.. స్టేషన్ హౌస్ అధికారి (ఎస్‌హెచ్‌వో) బదిలీ కావడంతో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి హాజరయ్యాడు.ఆ కార్యక్రమంలో రవికుమార్ పలు పాటలకు ఉత్సాహంగా డ్యాన్స్ చేశాడు. ఈ క్రమంలో రవికుమార్ ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు.అతడి సహచరులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. రవికుమార్ చనిపోయినట్లు ప్రకటించారు. అప్పటివరకు తమతో సరదగా ఉన్న సహచరుడు కానిస్టేబుల్ రవికుమార్ మృతిచెందడంతో ఆయన మిత్రులు షాక్‌కు గురయ్యారు.హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ డ్యాన్స్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బాగ్‌పత్‌కు చెందిన రవికుమార్ 2010లో ఢిల్లీ పోలీస్ డిపార్టుమెంట్ చేరాడు. అతడి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. 45 రోజుల క్రితమే రవికుమార్ యాంజియోగ్రఫీ పరీక్ష చేయించుకున్నారు.

### పారా ఒలింపిక్స్ లో స్వర్ణం సాధించిన అవని...

## చరిత్ర సృష్టించిందన్న ప్రధాని మోదీ

**పారిస్ లో పారా ఒలింపిక్ పోటీలు**

**షూటింగ్ లో నేడు భారత్ కు రెండు పతకాలు**

**10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ లో అవని లేఖర గోల్డెన్ హిట్**

**కాంస్యం సాధించిన మోనా అగర్వాల్**



**హైదరాబాద్ పెన్ పవర్:** పారిస్ నగరంలో జరుగుతున్న పారా ఒలింపిక్స్ లో భారత మహిళా షూటర్ అవని లేఖర స్వర్ణం సాధించింది. మహిళల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో అవని అదరగొట్టింది. అవని 2020 పారా ఒలింపిక్స్ లో షూటింగ్ విభాగంలో ఒక పసిడి, ఒక కాంస్యం సాధించడం విశేషం. పారిస్ ఒలింపిక్స్ లోనూ ఈ రాజస్థాన్ షూటర్ అంచనాలను అందుకుని త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది. కాగా, రాజస్థాన్ కే చెందిన మరో మహిళా షూటర్ మోనా అగర్వాల్ కాంస్యం సాధించింది. కాగా, అవని, మోనాలను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. అవని పారా ఒలింపిక్స్ లో మూడు పతకాలు సాధించిన తొలి భారత మహిళా అథ్లెట్ గా చరిత్ర సృష్టించిందని కొనియాడారు. ఆమె అంకితభావం భారత్ గర్వపడేలా చేస్తోందని పేర్కొన్నారు. కాంస్యం సాధించిన మోనా అగర్వాల్ ను కూడా మోదీ అభినందించారు. మెరుగైన ప్రతిభ కనబరిచేందుకు మోనా చూపిస్తున్న అంకితభావం ఇవాళ సాధించిన కాంస్యం ద్వారా ప్రతిఫలించిందని మోదీ పేర్కొన్నారు.

## సరికొత్త గరిష్ఠాలను తాకిన భారత స్టాక్ మార్కెట్

**జీడీపీ విడుదలకు ముందు అదరగొట్టిన సూచీలు**

**సెన్సెక్స్ 231 పాయింట్లు, నిఫ్టీ 83 పాయింట్లు అప్**

**గ్లోబల్ మార్కెట్‌పై అమెరికా ఫెడ్ రేటు తగ్గింపు అంచనాల ప్రభావం**



**హైదరాబాద్ పెన్ పవర్:** జీడీపీ డేటా విడుదలకు ముందు (సాయంత్రం జీడీపీ డేటా విడుదలైంది) భారత స్టాక్ మార్కెట్లు సరికొత్త రికార్డులు నమోదు చేశాయి. ఈరోజు సెన్సెక్స్ 231 పాయింట్లు ఎగిసి 82,365 వద్ద, నిఫ్టీ 83 పాయింట్లు లాభపడి 25,235 వద్ద స్థిరపడింది. ఓ సమయంలో సెన్సెక్స్ 82,637, నిఫ్టీ 25,268 పాయింట్ల వద్ద ఆల్ టైమ్ గరిష్ఠాన్ని తాకాయి.

బీఎస్ఈలో 2,239 కంపెనీల షేర్లు లాభాల్లో... 1,687 కంపెనీల షేర్లు నష్టాల్లో, 119 కంపెనీల షేర్లు ఎలాంటి మార్పు లేకుండా ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఆటో, ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, ఫిన్ సర్వీస్, ఫార్మా, రియాల్టీ, మెటల్ షేర్లు లాభపడ్డాయి. ఎఫ్ఎంసీజీ, మీడియా మాత్రమే నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్–30లో బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్టీపీసీ, బజాజ్ ఫిన్ సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, పవర్ గ్రిడ్, సన్ ఫార్మా, టీసీఎస్ టాప్ గెయినర్లుగా ఉన్నాయి. టాటా మోటార్స్, రిలయన్స్, ఐటీసీ, టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, నెస్లే, మారుతి సుజుకీ టాప్ లూజర్లుగా నిలిచాయి.

సెప్టెంబర్‌లో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు తగ్గిస్తుందనే అంచనాలు గ్లోబల్ మార్కెట్‌కు ఊతమిస్తోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రభావం భారత మార్కెట్ పైనా పడిందని, దీంతో సూచీలు సరికొత్త గరిష్ఠాలను తాకుతున్నట్లు చెబుతున్నారు.ఇదిలా ఉండగా, నిన్న విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.3,259 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,690 కోట్ల ఈక్విటీలను కొనుగోలు చేశారు. నిఫ్టీ ఇండెక్స్ 25,000 కంటే పైన ఉన్నంత వరకు మార్కెట్ బలం కొనసాగుతుందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ రూపక్ దే తెలిపారు. అంతకు దిగువకు వెళితే మాత్రం భారీ దిద్దుబాటు ఉండవచ్చునన్నారు. సెన్సెక్స్ 25,500 చేరుకునే అవకాశాలు ఉన్నాయన్నారు.

# ప్రాణాలతో చెలగాటం.. భారత జట్టు మా దేశానికి వద్దు: పాక్ మాజీ స్పిన్నర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం టీమిండియా పాకిస్థాన్ కు వెళ్తుందా లేదా అనే విషయంలో సస్పెన్స్ కొనసాగుతుంది. బీసీసీఐ భారత క్రికెట్ జట్టును పాక్ కు పంపించేందుకు ఆసక్తి చూపించడం లేదు. మరోవైపు పాకిస్థాన్ మా దేశంలోకి భారత్ రావాల్సిందేనని గట్టిగా పట్టు పడుతుంది. ఈ విషయంలో పాకిస్థాన్ మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా తమ దేశానికి భారత్ రావొద్దని సంచలన వ్యాఖ్యలు చేశారు. కనేరియా హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు పలుకుతున్నాడు. పాకిస్తాన్‌లో ప్రస్తుత భద్రతా పరిస్థితుల దృష్ట్యా అన్ని ఆటగాళ్లకు ముఖ్యంగా భారత ఆటగాళ్లకు భద్రత కల్పించడం చాలా ముఖ్యమని కనేరియా అభిప్రాయపడ్డారు. ఆటగాళ్ళ భద్రతకు ఎల్లప్పుడూ మొదటి స్థానం ఇవ్వాలని ఆయన తెలిపాడు. ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించడానికి పాకిస్తాన్‌కు మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ.. దేశంలో ప్రస్తుత వాతావరణం అన్ని జట్ల భద్రతకు గ్యారంటీ లేదని ఆయన అన్నారు. భద్రత తర్వాతే గౌరవం రెండవ ప్రాధాన్యతని.. హైబ్రిడ్ మోడల్ లో ఈ టోర్నీ జరపడం ఉత్తమం అని నేను భావిస్తున్నాని కనేరియా ఇంటర్వ్యూ ద్వారా చెప్పుకొచ్చాడు. భారత్ పాకిస్థాన్ కు వెళ్లకపోతే హైబ్రిడ్ మోడల్ లో మ్యాచ్ లు జరుగుతాయి. దీని ప్రకారం భారత్ మ్యాచ్ లు శ్రీలంక లేదా దుబాయ్‌లో జరుగుతాయి. 2023 ఆసియా కప్ టోర్నీ సమయంలోనూ ఇరు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య ఇదే గొడవ జరిగితే ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్ లో నిర్వహించారు. ఇండియా, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు, తీవ్రవాదం, కాశ్మీర్ అంశాల్లో వివాదం నడుస్తుంది.

ఈ క్రమంలోనే పాకిస్తాన్ వేదికగా జరిగే ఏ క్రికెట్ మ్యాచుల్లోనూ పాల్గొనటం లేదు ఇండియా జట్టు. 2023లో ఆసియా కప్ ను సైతం బహిష్కరించింది టీమిండియా. ఇప్పుడు కూడా అలాంటి నిర్ణయమే ఉంటుందని.. మార్పు ఉండకపోవచ్చని వార్తలు వస్తున్నాయి. పాక్ వేదికగా జరగనున్న ఈ మెగా ఈవెంట్ 2025 ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు జరగనుంది. అధికారిక షెడ్యూల్ ఇంకా ఖరారు చేయనప్పటికీ.. ప్రతిపాదిత షెడ్యూల్ మాత్రం రిలీజ్ చేశారు. దీని ప్రకారం గ్రూప్ ఏ లో పాకిస్తాన్, ఇండియా, బంగ్లాదేశ్,న్యూజిలాండ్.. గ్రూప్ బి లో ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్ ఈ మెగా టోర్నీ ఆడతాయి.

# ఇంగ్లాండ్ నయా ఆల్ రౌండర్: సెంచరీతో అట్కిన్సన్ విశ్వరూపం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ బౌలర్ గా టెస్ట్ జట్టులోకి వచ్చి తొలి మ్యాచ్ లోనే గస్ అట్కిన్సన్ సంచలన స్పెల్ తో అరంగేట్రాన్ని ఘనంగా చాటుకున్నాడు. వెస్టిండీస్ తో జరిగిన మూడు మ్యాచ్ ల సిరీస్ లో 22 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్నాడు. ఈ ప్రదర్శనకు గాను జూలై నెలలో ఇంగ్లాండ్ సీమర్ గస్ అట్కిన్సన్ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును గెలుచుకున్నాడు. అయితే ప్రస్తుతం జరుగుతున్న శ్రీలంక సిరీస్ లో అట్కిన్సన్ బ్యాటింగ్ లో చెలరేగడం విశేషం.రెండో రోజు ఆటలో భాగంగా లార్డ్స్ వేదికగా జరుగుతున్న ఈ టెస్టులో అట్కిన్సన్ సెంచరీతో చెలరేగడం విశేషం. శుక్రవారం (ఆగస్టు 30) 103 బంతుల్లో సెంచరీ సాధించి.. 118 పరుగుల వద్ద ఔటయ్యాడు. అతని ఇన్నింగ్స్ లో 14 ఫోర్లు, 4 సిక్సర్లు ఉండడం విశేషం. అతని స్ట్రైక్ రేట్ 100 కి పైగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తుంది. తొలి రోజు 74 పరుగులతో నాటౌట్‌తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఈ ఇంగ్లీష్ పేసర్ బౌండరీలతో హోరెత్తిస్తూ కెరీర్ లో తొలి సెంచరీని పూర్తిచేసుకున్నాడు. అట్కిన్సన్ బ్యాటింగ్ లో వీర విహారం చేయడంతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ లో 427 పరుగులకు ఆలౌటైంది. తొలి రోజు ఆటలో రూట్ (143) సెంచరీ చేశాడు. లంక బౌలర్లలో అసిత ఫెర్నాండోకు 5 వికెట్లు దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక లంచ్ సమయానికి 2 వికెట్ల నష్టానికి 32 పరుగులు చేసింది. ఓపెనర్లు మదుష్కా (7), కరుణ రత్నే (7) విఫమలమయ్యారు.

# కరేబియన్ ప్రీమియర్ లీగ్ నుంచి తప్పుకున్న సన్ రైజర్స్ స్టార్ ప్లేయర్




**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికా వికెట్ కీపర్–బ్యాటర్, సన్ రైజర్స్ విధ్వంసకర ప్లేయర్ హెన్రిచ్ క్లాసెన్ ప్రస్తుతం జరుగుతున్న కరీబియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ నుండి వైదొలిగాడు. ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా అతను ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపాడు. క్లాసన్ కరీబియన్ లీగ్ లో సెయింట్ లూసియా కింగ్స్ తరపున ఆడాల్సి ఉంది. ఈ జట్టుకు ఫాఫ్ డు ప్లెసిస్ కెప్టెన్సీ చేస్తున్నాడు. క్లాసన్ దూరం కావడంతో అతని స్థానంలో న్యూజిలాండ్ టాప్–ఆర్డర్ బ్యాటర్ టిమ్ సీఫెర్ట్ ను జట్టులోకి తీసుకున్నారు. సీఫెర్ట్ కు కరీబియన్ లీగ్ లో ఆడిన అనుభవం ఉంది. 2020 లో అతను ఆడిన ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ టైటిల్ గెలుచుకుంది. 2020–2022 మధ్య 33 మ్యాచ్ ల్లో ఆడిన ఈ కివీస్ బ్యాటర్ 531 పరుగులు చేశాడు. ఇక క్లాసన్ విషయానికి వస్తే ఒకప్పుడు ఈ లీగ్ లో గయానా అమెజాన్ వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. అయితే ప్రస్తుత సీజన్ లో సెయింట్ లూసియా కింగ్స్ జట్టులోకి వచ్చాడు. రెండేళ్లుగా క్లాసన్ అద్భుతమైన ఫామ్ లో ఉన్నాడు. 2024 ఐపీఎల్ సీజన్ లో ఇతని విధ్వంసం ఏ రేంజ్ లో కొనసాగిందో అందరికీ తెలిసిందే.

క్లాసన్ తో పాటు మరికొంతమంది స్టార్ ప్లేయర్లు ఈ లీగ్ కు దూరమయ్యారు. భుజం గాయం కారణంగా సెయింట్ కిట్స్, నెవిస్ పేట్రియాట్స్ తరపున ఆడుతున్న జింబాబ్వే ఆల్ రౌండర్ సికందర్ రజా టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. అతని స్థానంలో ఇంకా ఎవరు ఎంపిక కాలేదు. బార్బడోస్ రాయల్స్ తరపున ఆడుతున్న కేశవ్ మహారాజ్, డేవిడ్ మిల్లర్ ప్రారంభ మ్యాచ్ లను కోల్పోనున్నారు.

**సెయింట్ లూసియా కింగ్స్ స్క్వాడ్:**
ఫాఫ్ డు ప్లెసిస్ (కెప్టెన్), అల్జారీ జోసెఫ్, జాన్సన్ చార్లెస్, రోస్టన్ చేజ్, నూర్ అహ్మద్, డేవిడ్ వైస్, భానుకా రాజపక్స, మాథ్యూ ఫోర్డ్, ఆరోన్ జోన్స్, ఖరీ పియర్, ఖరీ కాంప్‌బెల్, జోహన్ జెరెమియా, షద్రాక్ డెస్కార్ట్, మిక్కెల్ గోవియా, క్లార్క్, అకీమ్ అగస్టే, టిమ్ సీఫెర్ట్

ఫిల్మ్‌ఫేర్ కోసం స్టీమీ బ్లాక్‌లో పోజులిచ్చిన కృతి సనన్!



# శామా సికిందర్ సూపర్ హాట్ షో ఇది!



బాలీవుడ్ బ్యూటీ షామా సికిందర్ ఇన్ స్టా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. నటి కన్నా..హాట్ గాళ్ల్ గా నెట్టింట ఓ సంచలనం. నిరంతరం సూపర్ హాట్ ఫోటోలతో యువతలో హాట్ టాపిక్ అవ్వడం అమ్మడి ప్రత్యేకత. ఈ విషయంలో మిగతా భామలందరి కంటే షామా సమ్ థింగ్ స్పెషల్ గా హైలైట్ అవుతుం ది. డిజైనర్ ఎంపికల్లో తనదైన హాట్ అప్పిరి యన్స్ తో గిలిగింతలు పెడుతుంది. .ఫ్రంట్ టూ బ్యాక్ అంటూ తనలో బ్యూటీని మరోసారి హైలైట్ చేసింది. క్లోజప్ షాట్ లో ఫ్రంట్ నుంచి లాంగ్ షాట్స్ లో బ్యాక్ నుంచి తనదైన మార్క్ అప్పిరియన్స్ తో చూపరులను ఆకట్టుకుంటుంది. మరోసారి క్లీవేజ్ షోతో కుర్రాళ్ల హృదయాల్ని ఛిద్రం చేస్తుంది. %ూశ్రీంశీ =ఝఎ% - భర్తను 'రాక్‌స్టార్'గా చూడాలనుకుందట అమ్మడి మ్యాకప్..హెయిర్ స్టైల్ ప్రతీది శామాలో బ్యూటీని హైలైట్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. శామా బ్యూటీపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ ఎన్నో. శామా అందాన్ని వర్ణించడానికి మాటల్లేవ్... మాట్లాడుకోవడాల్లేవ్ అంటూ ఓ యూజర్ పోస్ట్ చేసాడు. సింప్లీ వండర్ ఫుల్ అంటూ మరొకరు. ఇక షామా కెరీర్ సంగతి చూస్తే ప్రేమ్ అగాన్ సినిమాతో బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మన్ ది డెడ్లీ పార్ట్ .. ెలాంటి సినిమాల్లో నటించింది. బ్యూటీ చివరిసారిగా నటించిన బైపాస్ రోడ్ రిలీజ్ అయి మూడేళ్లు అవుతుంది. అప్పటి నుంచి కొత్త అవకాశాలేవి అందుకోలేదు.



అరియానా యొక్క అందమైన రెడ్ డ్రెస్ ఇన్‌స్టాగ్రామ్ లో ఆకర్షణీయంగా ఉంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com